క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ సమీపాన కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల : మండల పరిధిలోని గడిగరేవుల సమీపాన ఎర్రమల కొండలలో వెలసిన దుర్గా భోగేశ్వరాలయం కార్తీకమాసం శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు పంచ కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రాముఖ్యతను ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ వివరించారు.

చెరువులో చేప పిల్లలు విడుదల



చేప పిల్లలలను వదులుతున్న మత్స్యకారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ చెరవులో శనివారం మత్స్యకారులు చేప పిల్లలను విడుదల చేశారు. లక్షన్నర చేప పిల్లలను మత్స్యకార సంఘం సభ్యులు చెరువులో వదిలారు. గతంలోనూ లక్షన్నర చేప పిల్లలను చెరువులో వదిలినట్లు సంఘం సభ్యులు వెంకటేష్, విష్ణు తెలిపారు.

నేడు రజక కార్తీక మాస వనభోజనాలు

కర్నూలు (అర్బన్) : ఈనెల 10వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రజక కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు, నాయకులు కేతూరు మధు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక గౌరీగోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కిసాన్ ఘాట్ ఫన్ అండ్ ఫుడ్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కేసీకి 2,445 క్యూసెక్కుల నీరు విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి దిగువకు ఒక గేటు పైకెత్తి 2,264 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇప్పటి వరకు 2024–25 నీటి సంవత్సరంలో బ్యారేజీ నుంచి దిగువకు 338 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు జల వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

19న హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ సభ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం


కర్నూలు(సెంట్రల్): జిల్లా హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ 5వ వార్షికోత్సవ సభను ఈనెల 19వ తేదీన ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. శనివారం యూనియన్ కార్యాలయంలో వార్షికోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వార్షికోత్సవ సభలో హోటళ్లు, బేకరీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించేలా తీర్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, టి.రామాంజనేయులు పాల్గొన్నారు. నాయకుడు జి.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వరి రైతు కుదేలు!

- అన్నదాతను ముంచిన వర్షాలు
- భారీగా తగ్గిన దిగుబడులు
- లభించని గిట్టుబాటు ధర



కొండజూటూరులో వరిపైరును యంత్రంతో కోస్తున్న దృశ్యం



రాసిగా పోసిన వరి ధాన్యం

పాణ్యం: అన్నదాతలను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రత్యేకించి ఈయేడు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు దాదాపు వర్షార్పణం అయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి రైతుల పరిస్థితి మరీ అధ్వానం. పాణ్యం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ఎస్సార్బీసీ కాలువ కింద వరి పంటను అధికంగా సాగు చేశారు. జూన్‌లో దాదాపు మూడువేల హెక్టార్లకుపైగా వరి సాగు అయ్యింది. ప్రత్యేకించి గోరుకల్లు, కొండజూటూరు, కొణిదేడు, అలమూరు, పాణ్యం గ్రామాల్లో విస్తారంగా వరి సాగు చేశారు రైతులు. అయితే తుపాన్ ప్రభావంతో కురిసి వర్షాలకు వరిపైరు నేలవాలింది. అష్టకష్టాలు ఓర్చుకుని నేలవాలిన పైరును కట్టలు కట్టుకుని కొంతమేర కాపాడుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాల కింద ప్రారంభమైన వరి కోతలు ప్రస్తుతం ఊపందుకున్నాయి. అయితే దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. అదేవిధంగా గిట్టుబాటు ధర కూడా లభించకపోడంతో రైతులు నేల చూపు చూస్తున్నారు. రైతులకు అండగా నిలువాల్సిన టీడీపీ కూటమి ప్రభుత్వం పట్టించుకోడం లేదనే విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

భారీగా పెరిగిన ఖర్చులు...

వరి సాగు అంటేనే ఖర్చు. ఎకరానికి రూ. 25–30 వేల వరకు పెట్టుబడి అవుతుంది. అయితే ఈయేడు వర్షాల మూలంగా ఖర్చు భారీగా పెరిగింది. వర్షాలకు పైరు నేలవాలడంతో కట్టలు కట్టేందుకు కూలి ఖర్చులు భరించాల్సి వచ్చింది వరి రైతులు. దీంతో ఎకరానికి మరో పదివేల రూపాయలు అదనంగా భరించాల్సి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పంట కోతలకు సంబంధించి యంత్రాలకు గంటకు రూ. 2,500 రైతులు చెల్లించేవారు. ఈ ఏడాది తడిసిన పంటను కట్టల మూలంగా కోతకు ఎక్కువ సమయం పడుతుంది. గంటకు రూ. 2,600 చొప్పున చెల్లించాల్సి వస్తుంది. గతంలో ఎకరానికి 40బస్తాలపైనే దిగుబడి వచ్చేవి. ఈయేడు 25–30 బస్తాల వరకు మాత్రమే వచ్చాయి. ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గతేడాది గిట్టుబాటు ధర బస్తా రూ. 1800పైగానే పలికింది. ప్రస్తుతం రూ. 1500లోపే ఉండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

వరికి మద్దతు ధర కల్పించాలి



నేను ఈ ఏడాది 20ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరానికి రూ. 35–40వేల వరకు ఖర్చు వచ్చింది. వర్షాల కారణంగా కూలీల ఖర్చులు మరో రూ. 10 అదనంగా భారం పడింది. వర్షాల వలన దిగుబడులు ఎకరానికి 32–36బస్తాల వరకు మాత్రమే వచ్చాయి. ధర కూడా గిట్టుబాటుగా లేదు. గతంలో ఎకరానికి 40–45బస్తాల వరకు దిగుబడి తీశా. వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం వరి రైతుకు మద్దత్తు ధర పెంచి ఆదుకోవాలి.

– గోవర్ధన్‌రెడ్డి కొండజుటూరు

మంగళ ద్వాదశి వేడుకలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న టీడీపీ హిందూ ధర్మ ప్రచార సభ్యులు

కోడుమూరు రూరల్ : కార్తీకమాసం ద్వాదశి విశిష్టతను పురస్కరించుకుని ఈనెల 13న గూడూరులో నిర్వహిస్తున్న మంగళ ద్వాదశి వేడుకలను జయప్రదం చేయాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వహకులు మల్లువెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గూడూరులో ద్వాదశి వేడుకల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ గూడూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 13న కార్తీక మాసం ద్వాదశి విశిష్టతను పురస్కరించుకుని హోమం, వేంకటేశ్వర స్వామి విశేషార్చన, నామసంకీర్తన వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు డమాం సురేష్, ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున, లోకేశ్వరయ్య, మునిస్వామి, నాగరాజు, గోపాల్, రంగడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధార్మిక ప్రవచన సప్తాహం



కరపత్రాలను విడుదల చేస్తున్న మల్లు వెంకటరెడ్డి

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులోని జీవేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు కార్తీక మాసం విశిష్టతపై ధార్మిక ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లను శనివారం దేవస్థానంలో ఆవిష్కరించారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13వ తేదీన కల్లూరు మండలం, పర్ల గ్రామం, గూడూరులోని ఎస్సీ కాలనీలోని లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం, నంద్యాల మండలం, పొన్నాపురం, ఆళ్లగడ్డ ఎస్సీ కాలనీలోని చెన్నకేశవస్వామి, రామాలయంలో మంగళ కైశిక ద్వాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన ఓర్వకల్లు, ఆళ్లగడ్డలో కార్తీక దీపోత్సవం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రముఖ రుగ్వేద జ్యోతిష్య పండితులు విరివింటి పణిశశాంక శర్మ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దికుంట రాంభూపాల్ రెడ్డి, లింగం వెంకటకృష్ణయ్య, గోవిందరెడ్డి, లక్ష్మికాంతారెడ్డి, వైవి సుబ్బారెడ్డి, కొవ్వూరు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, డాక్టర్. కాంతయ్య, వెంకటరామిరెడ్డి, వెంగళరెడ్డి, ధర్మప్రచార మండలి సభ్యులు రమేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శనివారం కోడుమూరులో చోటు చేసుకుంది. దేవనకొండ మండలం చెల్లెలిచెలిమ గ్రామానికి చెందిన సంజప్ప కుటుంబ సభ్యులతో కలిసి కోడుమూరు మండలంలోని వెంకటగిరి గిడ్డాంజనేయస్వామిని దర్శించుకునేందుకు శనివారం ఉదయం బయలుదేరాడు. కోడుమూరులో పూజా సామాగ్రి తీసుకునేందుకు వెళ్లగా 11ఏళ్ల కుమారుడు గిరి ప్రసాద్ తప్పిపోయాడు. దీంతో సంజప్ప పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ శ్రీనివాసులు వెంటే స్పందించారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఎట్టకేలకు తప్పిపోయిన బాలుడు గిరిప్రసాద్‌ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాసులుకు, సిబ్బందికి బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలి



ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం నాయకులు పట్టణంలో ప్రజాపోరు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నాయకులు ప్రజలకు వివరించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా పింఛన్ మినహా చేసిందేమీ లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నారే తప్పా మహిళల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని ఆరోపించారు. రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున రైతు భరోసా, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లిదండనం పేరుతో రూ.15వేలు, 18సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలను మభ్యపెట్టే చర్యలు మానుకుని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవతం చేయాలని ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ సభ్యులు రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియ్యా, వీరన్న, లక్ష్మన్న, మునిస్వామి, శంకర్, బండ బాబు, గిడ్డయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



మృతి చెందిన సంతోష్ కుమార్

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఆటో ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందు తూ శనివారం మృతి చెందా రు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రా మానికి చెందిన రెడ్డిపోగు శేఖర్ కొడుకు సంతోష్ కుమార్(5) ఈ నెల 8వ తేదీన ఉదయం రోడ్డు దాటుతుండగా అదే సమయంలో ఉయ్యాలవాడ గ్రామా నికి చెందిన బోయ ఆనంద్ తన ఆటో నడుపుతూ ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక మతి చెందారు. మృతుని తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



రైతులతో సంతకాలు చేయిస్తున్న నాయకులు

గడివేముల : అలగనూరు రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఎం జిల్లా సమితి కార్యదర్శి రంగ నాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదం తెలిపి బడ్జెట్లో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అబ్రహం, బాషా, మాభాషా, రసూల్, ఇబ్రహీం, సోఫీ సాహెబ్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు

వైకుంఠ వాసునికి ఉదయాస్తమాన ఆర్జిత సేవలు

కర్నూలు కల్చరల్: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వైకుంఠ వాసునికి ఉదయాస్తమాన ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, ఉపాధ్యక్షుడు మహబలేష్ తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఓటు నమోదు చేయించుకోండి



శరీన్‌నగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవ్య

- జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య

కల్లూరు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో శనివారం పోలింగ్ కేంద్రాలలో జరగుతున్న ప్రత్యేక ఓట నమోదు కార్యక్రమాన్ని జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డూప్లికేట్స్, డెత్ కేసులు ఏమైనా ఉంటే ఫారం–7 అప్లికేషన్ తీసుకోవాలని సూచించారు. ఓటరు అడ్రస్ మార్పులు, చేర్పులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఎంఈఓ శ్రీనివాసులు, ఆర్ఐ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 24 దరఖాస్తులు

సి.బెళగల్: మండలంలో ఓటు హక్కుకోసం 24 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని గ్రామాల్లో బీఏల్వోలు ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యాక్రమం నిర్వహించారు. 11 మంది యువతులు, 13 మంది యువకులు నూతన ఓటు హక్కుకు దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు.

ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కర్నూలు(రూరల్): సీపీఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ.తాండ్రపాడు గ్రామంలో నాయకులు పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు విమర్శించారు. ప్రభుత్వాల మోసపూరిత విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఉసేనయ్య, రాఘవేంద్ర,ఆంజనేయులు ఈ.తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా, వేంకటేశ్వర్లు, మధు, గోపాలు, రామంజులు, మద్దిలేటి తదియితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



ఐక్యత చాటుతున్న మహాసభలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్ : విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకొచ్చిన బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అశాస్త్రీయ భావజాలన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చి విద్యార్థులను అజ్ఞానంలో నెట్టుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియ ద్వారా 3,4,5వతరగతుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను సకాలంలో భర్తీ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేంద్ర, అల్తాఫ్ బాషా, నరసింహులు, సిద్దు, కిశోర్, పులికొండ, బాలరామాంజినేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో శనివారం, ఆదివారాల్లో కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఆర్యన్, ఆధిత్య, భాస్కర్ పాల్గొన్నారు.

గోవిందా..గోవింద!

- తిరుమలకు పాదయాత్ర ప్రారంభం



భక్తి చైతన్య పాదయాత్ర రథం వద్ద మహిళలు

కర్నూలు కల్చరల్: తిరుమలకు కర్నూలు నుంచి భక్తి చైతన్య పాదయాత్ర ప్రారంభమైంది. కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు 800 మంది భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ కాలినడకన బయలుదేరారు. యాత్ర ప్రారంభ సందర్భంగా ఓఎల్డ్‌సిటీలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద చైతన్య రథానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఉమ్మడి కర్నూ లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు, భక్తిచైతన్య పాదయాత్ర కమిటీ గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్వీ విజయ మనోహరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 13 ఏళ్ల నుంచి ఏటా భక్తి చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర స్వామిని కాలినడకన దర్శించుకోవడాన్ని భక్తులు అదృష్టంగా భావిస్తారన్నారు. కమిటీ సభ్యులు శివయ్య, మాదన్న, శ్రీనివాసులు, శ్రీరాములు, గురవయ్య, రమణారెడ్డి, సుధాకర్ తదితరులు భక్తులకు అన్ని వసతులతో యాత్ర సాగేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తి చైతన్యరథం యాత్రలో కోలాటాలు, నందికోల, చెక్క భజన, సంకీర్తనల ఆలాపన ప్రత్యేకంగా నిలిచాయి.





భక్తి చైతన్య పాదయాత్రలో కోలాటం, నందికోల, చెక్క భజనలు ప్రదర్శిస్తున్న భక్తులు

నేడు 'సెల్లు పురాణం' శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన 'సెల్లు (సెల్ ఫోన్) పురాణం' శతకం ఆవిష్కరణ ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్‌మియ్యా తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, సత్యసాయి జిల్లా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య శతకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.